


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 21.02.2026 | సంపుటి : 3 | సంచిక :20 | పేజీలు : 9 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 21.02.2026 | volume : 3 | Issue : 20 | Pages : 9 | Cost : 2/- |



## యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### మత్స్యావతార అలంకారంలో నారసింహుడు

మహిమాన్విత యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడి మత్స్యావతార అలంకార వైభవం భక్త జనులను అలరించింది. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు.

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20 : అనంత రం స్వామివారిని అభిషేకించి మత్స్యా వతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ

-మిగతా 2 లో..

# మానవ మేధస్సుకు ఎఐ సవాల్

### సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

### ఎఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

హైదరాబాద్‌లో వార్ రూమ్ ఏర్పాటుకు సిద్ధం

ఏఐ రంగంలో అవకాశాలు అంది పుచ్చుకోవాలి

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 లో సీఎం రేవంత్ రెడ్డి

గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్శిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు.



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం

-మిగతా 2 లో..



## సుంకాలు విధించే హక్కు ట్రంప్‌కు లేదు

### అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు

యూఎస్ : అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివిధ దేశాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లను ఆ దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడికి లేదని తేల్చింది. ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి వసూలు చేసిన సుంకాలను ట్రంప్ తిరిగి చెల్లించాల్సిందే అని స్పష్టం చేసింది. అయితే.. అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో యూఎస్ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా లాభాల బాటపట్టాయి. ఇప్పటికే పలు దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్.. భారత్‌పై 18 శాతం సుంకాలు వసూలు చేస్తున్నారు. సుప్రీం తీర్పుతో భారత్ నుంచి వసూలు చేసిన సుంకాలను తిరిగి చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికా సుప్రీంకోర్టులో ప్రెసిడెంట్ ట్రంప్‌నకు ముగ్గురు న్యాయమూర్తులు అనుకూలంగా ఉండగా.. ఆరుగురు న్యాయమూర్తులు వ్యతిరేకించారు.



## అక్రిడేషన్‌ల జారీలో ఎలాంటి తప్పులుండొద్దు

### వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

### డిపిఆర్‌వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్

జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డి.పి.ఆర్.ఓ.లను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పక్రియ విధి విధానాలపై డి.పి.ఆర్.ఓ.లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది.

హైదరాబాద్, ఫిబ్రవరి 20 : ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జి.ఓ. నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పి.ఆర్.ఓ.లకు సూచించారు. జిల్లాస్థాయి

-మిగతా 2 లో..

## వాస్తవాలకు దగ్గరగా నిధులు కేటాయించాలి

### హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్ ఉండాలి

అధికారంలోకి వచ్చి 800 రోజులైనా దిక్కులేదు

ఎన్నికల ముందు రాసిచ్చిన బాండ్ పేపర్ల గతేమయ్యింది

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

సిద్దిపేట, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్‌ను తయారు చేయాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన

-మిగతా 2 లో..





## భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ

### బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 : ఇండియాతో సంబంధాల పునరుద్ధరణ దిశగా తారిఖ్ రెహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం తొలి అడుగు వేసింది. భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 115 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 206 (కిలో) |
| స్కిన్ లెస్ | 234 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72




## ఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు

### స్మగ్లర్ల ఆగడాలు అరికట్టేందుకు..

ప్రభుత్వం పరిశీలిస్తోందన్న మంత్రి జూపల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 : స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్

-మిగతా 2 లో..



## కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డికి అస్వస్థత

### హుటాహుటిన హైదరాబాద్ నిమ్స్‌కు తరలింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా

-మిగతా 2 లో..

## కర్రెగుట్టలో పేలిన ఐఈడీ బాంబు

### జవాన్‌కు తీవ్ర గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు

ములుగు, ఫిబ్రవరి 20 : జిల్లాలోని వెంకటాపురం మండలం తెలంగాణ , చత్తీస్‌ఘడ్ సరిహద్దులోని పాముసూరు సమీపంలోని కర్రెగుట్టలో జవానులు సెర్చ్ అపరేషన్ చేస్తుండగా ఐఈడీ బాంబు పేలి జవానుకు గాయాలయ్యాయి. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కర్రెగుట్టల్లోని పాముసూరు, జెల్లా గ్రామాల సమీపంలో 39 బెటాలియన్ సీఆర్పీఎఫ్ బృందాలు శుక్రవారం సెర్చ్ అపరేషన్ నిర్వహించాయి. ప్రమాదవశాత్తు ఐఈడీ బాంబు పేలి నవజీత్ అనే జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి పోలీసు బృందాలు పాముసూరు నుంచి జెల్లా గ్రామానికి



-మిగతా 2 లో..



# హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్ ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా, రాహుల్ రాసిచ్చిన బాండ్ పేపర్లు ఏమాయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 800 రోజులైనా ఒక్క హామీకి దిక్కులేదని, గెలిచిన నెలకే వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 4000 పెన్షన్ అన్నారు. 27 నెలలైనా రాలేదని మండిపడ్డారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నిధులు పెడతారా, లేదా? అంటూ ప్రశ్నించారు. నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు. ఒక్కరికైనా రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. వెంటనే బ్జడెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఎగ్గొట్టారని, రాజీవ్ యువ వికాసం అంతా బూటకమని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లన్నీ ఉత్త మాటలే. అసెంబ్లీలో మాయ మాటలు మాని, వాస్తవ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకిచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10వేలు, ఇంటర్ పాస్ అయితే రూ. 25 వేలు, డిగ్రీకి రూ. 50వేలు, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి, ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20 వేలు కోట్ల బ్జడెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపిందని విమర్శించారు . వరంగల్ సభలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ అని చెప్పి మాయమాటలు చెప్పారని, ఏటా రూ. 15వేలు రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసిందని పేర్కొన్నారు. గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు చేయగా కాంగ్రెస్ రూ. 4వేలు ఇస్తామని హామీ ఇప్పటి వరకు నెరవేర లేదని అన్నారు. ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత , చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4వేలు పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్జడెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలని, రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా బ్జడెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# ఎక్సైజ్ శాఖ సిబ్బందికి ఆయుధాలు

(మొదటిపేజీ తరువాయి)

శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణెళి లక్ష్యం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం

## పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యే వరకు పోరాడుతా కరాటే కళ్యాణి స్పష్టీకరణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం.. పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు పోరాడుతానని కరాటే కళ్యాణి స్పష్టీకరించారు. హిందూ దేవుళ్లనే కాకుండా.. భారతదేశ ఔన్నత్యాన్ని కించపరిచే విధంగా తెలుగు యూట్యూబర్ 'నా అన్వేషణ' అన్వేశ్ వ్యాఖ్యలు చేశారని ప్రముఖ సినీ నటి కరాటే కల్యాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్వేశ్ లాంటి వారిని ఉపేక్షించకూడదని హెచ్చరించారు. ఫాలోవర్స్ ఉంటే ఏది మాట్లాడితే అది చెల్లుబాటు అవుతుందని అనుకుంటే కుదరదని వార్నింగ్ ఇచ్చారు. హిందూ దేవుళ్లను కించపరిచినందుకే అన్వేశ్‌పై కేసు పెట్టామని.. తమ ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని కరాటే కల్యాణి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ.. అన్వేశ్ జీరోకు వచ్చారని.. ఎక్కడ స్టార్ట్ అయ్యారో.. అక్కడికే రావాలన్నది తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. అన్వేశ్‌లో మేకపోతు గాంభీర్యం కనిపిస్తోందని విమర్శించారు. యూట్యూబ్ పోతే పుడ్డు లేదన్న భయం అతనికి పట్టుకుందని కరాటే కల్యాణి ఎద్దేవా చేశారు. ఇన్‌స్టాగ్రామ్ బ్యాన్ అయ్యాక బుర్ర లేకుండా అతను మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అన్వేశ్ మానసిక స్థితి కూడా బాగోలేదని చెప్పుకొచ్చారు. అన్వేశ్ పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు తన పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. అన్వేశ్‌ను భారతదేశం రప్పించడమే తమ లక్ష్యమని కరాటే కల్యాణి పేర్కొన్నారు.

# సాంకేతిక విప్లవంలో ఇదో అంకం

(మొదటిపేజీ తరువాయి)



రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చు కోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశర చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

(మొదటిపేజీ తరువాయి)



అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల పక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారుల తో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాల యంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదిం చి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ పక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓ.లను ఆయన కోరా రు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓ.లు, సంబంధిత సిబ్బంది హాజర య్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడి టేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.

# డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

- తెలంగాణ రైజింగ్'లో ట్రాన్స్ ఫార్మేషన్ టూల్‌గా టెక్నాలజీ
- కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీ స్ సామాన్యుడికి చేరువ చేయాలన్న తపన
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :** ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను సామాన్యుడికి చేరువ చేసి... డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో టెక్నాలజీని కేవలం ఓ సాఫ్ట్వేర్ గా మాత్రమే కాకుండా... ఓ ట్రాన్స్ ఫార్మేషన్ టూల్ గా మార్చుకుంటున్నామన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రణాళికలను న్యూఢిల్లీ భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా శుక్రవారం 'ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్; ఏఐ ఫర్ గవర్నమెంట్ సర్వీసెస్ అండ్ క్లైమేట్ రెసిలియెన్స్' అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. పౌర సేవలకు టెక్నాలజీని అనుసంధానం చేసి... ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఉండే దూరాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఐకం, ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, భూ భారతి లాంటి విప్లవాత్మక సంస్కరణలు డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణ బ్రాండ్ ను సుస్థిరం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఫలాలను కేవలం ఓ ప్రాంతానికో లేదా వర్గానికో పరిమితం చేయకుండా అందరికీ చేరువ చేసేలా 'ఏజెంటిక్ ఏఐ' వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. టెక్నాలజీని కేవలం గవర్నెన్స్ కు మాత్రమే పరిమితం చేయకుండా వ్యవసాయం, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ, డిజాస్టర్ మేనేజ్ మెంట్ తదితర రంగాలకూ విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణా అవకాశాల గని.. అపారమైన టాలెంట్ పూల్ మా బలం అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణాలో ఏఐ పరిశోధలు, ఆవిష్కరణలకు ప్రభావశీలమైన టాలెంట్ పూల్ ఉందని తెలిపారు. ఏఐ సమ్మిట్‌లో స్వీడెన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేథ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను, అది తీసుకువచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రభుత్వం ముందే సంసిద్ధమైంది. దానికి తగ్గట్టుగా సాఫ్ట్ వేర్ నిపుణుల నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు ప్రారంభించాం. ఇదిలావుంటే ఏఐ విస్తృతితో ఉద్యోగ విధుల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. అందుకు అవసరమైన సన్నధను మొదలు పెట్టింది మా ప్రభుత్వమే.ఏఐ పరిశోధన కేంద్రాలు, అప్లికేషన్లు, సేవల వల్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. యువత దీనిని అందిపుచ్చుకోవాలి.యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టేందుకు ఏఐ అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది.స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ అనేది రెండేళ్లుగా మేం మంత్రంలా జపిస్తున్నాం.ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఏఐ వినియోగం వల్ల లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెరుగుతుంది. దుర్వినియోగానికి ద్వారాలను మూసివేస్తుంది. ఇందుకు అవసరమైన అప్లికేషన్లను రూపొందించడం, నూతన ఆవిష్కరణలను చేపట్టేందుకు గ్లోబల్ టెక్ కంపెనీలు ముందుకు రావాలని అన్నారు. కృత్రిమ మేథ ఫలాలను ప్రజలందరి వద్దకు చేర్చేందుకు ప్రతి గ్రామానికి ఇంర్నెట్ కనెక్టివిటీని అందించే బృహత్తర యజ్ఞం ఇప్పటికే మొదలైంది. ప్రతి గ్రామాన్ని ప్రపంచంతో కనెక్ట్ చేసేందుకు రెండేళ్లుగా శ్రమిస్తోంది. ఏఐ ఓ గేమ్ ఛేంజర్. దాన్ని మచ్చిక చేసుకోవాలి. మన నైపుణ్యాలకు పదును పెట్టుకుని దానిని నియంత్రణలోకి తెచ్చుకోవాలి.పెట్టుబడులకు తెలంగాణా స్వర్గధామం లాంటిది. కొత్తదనానికి రాష్ట్రం ఎప్పుడూ స్వాగతం పలుకుతూ ఉంటోంది.దీనికి అనుకూలమైన ఎకోసిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేశాం. నిరంతర విద్యుత్తు సరఫరా, స్థిరమైన విధానాలు అమలు చేస్తున్నాం అని వివరించారు.



# యాదాద్రిలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు.దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం ప్రత్యేకత అంటూ ప్రధానార్చకులు మత్స్యావతార విశిష్టతను వివరించారు. పట్టు వస్త్రాలు, బంగారు, వజ్రా భరణాలు, వివిధ రకాల పుష్పాలతో దివ్య మంగళకరంగా అలంకరించిన స్వామి వారిని కొలుస్తూ మంత్రోచ్ఛరణలు, మూలమంత్ర జప స్తోత్రాలు సాగుతుండగా గోవిందనామ స్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాందూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# కర్రెగుట్టలో పేలిన ఐఈడీ బాంబు

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డు వేసే క్రమంలో 11 ఐఈడీ బాంబులను గుర్తించి నిర్వీర్యం చేశారు. 12 వ బాంబును గుర్తించి నిర్వర్యం చేసే క్రమంలో పేలి ఈ ప్రమాదం జరిగింది. జవాన్ కాలుకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని హుటాహుటినా వెంకటాపురం తరలించి హెలికాప్టర్‌లో మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలించారు.

# కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డికి అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, జీవన్ రెడ్డి ఇటీవల కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొం టున్నాడు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా .సంజ య్, జీవన్ రెడ్డి మధ్య వర్గపోరు కొనసాగుతోంది.ఒక దశలో పార్టీని కూడా వీడుతానని జీవన్ రెడ్డి అలకబూనడంతో అధిష్ఠానం బుజ్జగింపులతో వెనక్కి తగ్గారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సైతం తన వర్గం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్నాడు. సీనియర్ అయిన తనను సరిగా గౌరవం ఇవ్వడం లేదని అసృం తృప్తికి లోనవుతున్నాడు. జీవన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# భారత పౌరులకు వీసా సర్వీసుల పునరుద్ధరణ

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. దీంతో రెండు నెలులుగా నిలిచిపోయిన వీసా సర్వీసులు తిరిగి ప్రారంభమయ్యాయి. బీఎన్‌పీ నేత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లోని అన్ని వీసా సర్వీసులను త్వరలోనే పునరుద్ధరిస్తున్నట్టు సీనియర్ ఇండియన్ కాన్సులర్ అధికారి న్యూఢిల్లీలో గురువారంనాడు ప్రకటించారు. ఈ క్రమంలో భారతీయ పౌరులకు వీసా సర్వీసులను ఢిల్లీలోని బంగ్లాదేశ్ హై కమిషన్ శుక్రవారంనాడు పునరుద్ధరించింది. కొద్దికాలం క్రితం భారత వ్యతిరేక యువనేత షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యకు గురికావడం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. హదీ హత్యానంతరం హిందూ మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. గత డిసెంబర్ నుంచి భారత్-బంగ్లా మధ్య వీసా సర్వీసులు నిలిచిపోయాయి. అయితే యూనస్ తాత్కాలిక ప్రభుత్వం తప్పుకోవడం, ప్రజాస్వామ్యబద్ధంగా తారిఖ్ రెహ్మాన్ ఎన్నికకావడంతో భారత్-బంగ్లా మధ్య సంబంధాల పునరుద్ధరణకు సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి.

## ఆయిల్ పామ్ సాగుతో

# తెలంగాణ రైతాంగానికి మహర్దశ

- ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో సాగుకు రూ.456 కోట్లు కేటాయింపు
- పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలి
- దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి
- కామారెడ్డి జిల్లాలో మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో మంత్రి తుమ్మల





**కామారడ్డి, ఫిబ్రవరి 20 :** తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుతో రైతాంగానికి మహర్దశ పట్టనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పాల్వంచమర్రి గ్రామంలో ఉ ద్యాన ,పట్టు పరిశ్రమ శాఖతో పాటు హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సింగిరెడ్డి బలరాం ఆరున్నర ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ పంట రైతుల కుటుంబాలను ఆర్థికంగా బలపరుస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.88 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉన్నదని, ప్రజా ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుండి ఇప్పటివరకు 32,923 మంది రైతులు 1,05,455 ఎకరాల్లో ఈ పంట సాగును చేపట్టారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రూ.456 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా, సిద్దిపేట జిల్లా నర్మేట్టలో నిర్మాణం పూర్తయిన ఫ్యాక్టరీ త్వరలో అందుబాటులోకి రానుందని మంత్రి చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో అంతర పంటలను సాగు చేస్తూ రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పంట నాలుగు సంవత్సరాల్లో దిగుబడిని ఇవ్వడం ప్రారంభించి 30 నుంచి 40 సంవత్సరాల పాటు ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా అంతరపంటల ద్వారా కూడా అధిక లాభాలను పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టాలనుకునే రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, డ్రిప్ సౌకర్యాలను ప్రభుత్వం రాయితీ మీద అందిస్తుందని, రైతుకు ఎకరాకు రూ.51,000 సబ్సిడీ రూపంలో అందచేయడం జరుగుతున్నదని, అందుబాటులో ఉన్న ఈ అవకాశాలను వినియోగించుకుని రైతులు పెద్దఎత్తున ఆయిల్ పామ్ సాగును చేపట్టాలని మంత్రి సూచించారు. కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ పంట ద్వారా ఎకరానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని, మార్కెట్ సమస్యలు లేకుండా సాగు చేయగల పంట ఇదేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల మాదిరిగా కామారెడ్డి జిల్లా కూడా ఆయిల్ పామ్ సాగులో ముందంజలో నిలవాలని సూచించారు. హిందుస్థాన్ యూనిలీవర్ ప్రతినిధి వరుణ్ మెహత మాట్లాడుతూ కంపెనీ తరపున సాగు, మార్కెటింగ్‌కు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. డ్రిప్ సౌకర్యానికి అదనంగా కంపెనీ ద్వారా రూ.5,000 ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మదన్ మోహన్, ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్, సర్పంచ్ శేకర్ తదితరులు పాల్గొన్నారు. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ ప్రతినిధులు వి÷-లలెం యూజెన్, యోగేష్ మిశ్రా, విపుల్ పాటిల్, వరుణ్ మెహత, సుందర్ మహాజన్, రతీష్ మాత్యు, విజయ రంగస్వామి కూడా హాజరయ్యారు.



## ఘాట్ రోడ్డులో కారును ఢీకొన్న లారీ

### ప్రమాదంలో ఏడుగురు వ్యక్తుల దుర్మరణం

**అహ్మదాబాద్, ఫిబ్రవరి 20 :** ఘాట్ రోడ్డులో ఒక కారును లారీ ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ కారు ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. ఆ కారులో ప్రయాణించిన ఏడుగురు వ్యక్తులు ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. గుజరాత్‌లోని వాస్లాడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో కర్పాడలోని కుంభ్‌ఘాట్ రోడ్డులో వేగంగా వెళ్తున్న కారును ఒక లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. అదుపుతప్పిన ఆ కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఆ కారు నుజ్జునుజ్జు అయ్యింది. కాగా, కారులో ప్రయాణించిన ఏడుగురిలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. ఆసుపత్రికి తరలించగా మరో ఇద్దరు అక్కడ చనిపోయారు. మరణించిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. మరోవైపు మృతులను అంబా జంగిల్ గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. నానా పోండాకు కారులో వారు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



## ఎల్బీనగర్ చట్నీస్‌లో పేలుడు

### ముగ్గురు సిబ్బందికి గాయాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో పేలుడు సంభవించింది. భారీ శబ్దానికి వినియోగదారులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇడ్లీ స్టీమర్‌లో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధిక వేడిమి కారణంగానే స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు పేలుడు సంభవించిన కిచెన్‌ను పరిశీలించాయి. ఇడ్లీ స్టీమర్ వేడెక్కడంతోనే పేలుడు సంభవించిందా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దేవాదుల మోటర్లు

# ఎందుకు ఆగిపోయాయి?

- పంటలు ఎండుతున్నా ఎందుకు పట్టించుకోరు?
- రైతు భరోసాపై ఇంకా తాత్సారం ఎందుకు?
- దేవాదుల పంప్‌హౌజ్ వద్ద మీడియాతో హరీష్ రావు



**వరంగల్, ఫిబ్రవరి 20 :** అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. రైతులపై పగబట్టారా..? అంటూ ఫైర్ అయ్యారు. కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో హరీశ్‌రావు శుక్రవారం పర్యటించారు. దేవన్నపేట పంప్‌హౌస్ దగ్గర దేవాదుల మోటార్లని పరిశీలించాక మీడియాతో మాట్లాడారు. మోటార్లు ఎందుకు ఆగాయంటూ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరిలో నీరు వృథాగా పోతున్నా... దేవన్నపేటలో మూడు మోటార్లు పది రోజులుగా ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో మంత్రులు వచ్చి మోటార్లు ప్రారంభిస్తామని చెప్పి.. చివరకు ప్రారంభించకుండా వెళ్లారని దుయ్యబట్టారు. రైతులపై పగబట్టారా..?, కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు 60వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. దేవాదుల ప్రాజెక్టులో అతి పొడవైన, లోతైన పంప్ హౌస్ దేవన్నపేట అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే దేవాదుల థర్డ్ ఫేస్ పూర్తి చేశామని హరీశ్‌రావు ప్రస్తావించారు. నాడు దేవాదులపై కాంగ్రెస్ చిన్నచూపు చూస్తే... కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పూర్తి చేశారని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో దేవాదుల ఆయకట్టును 3లక్షల 17వేల ఎకరాలకు పెంచామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్.. వరంగల్ జిల్లా రైతాంగం నోరుకొడుతోందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో దేవాదులపై రూ.7,300 కోట్లు ఖర్చు చేశామని, 80శాతం ప్రాజెక్టు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. 2026 మార్చి కల్లా దేవాదుల పూర్తి చేస్తామని మంత్రులు చెప్పారని... ఇప్పటికీ పైసా పని కూడా చేయలేదని నిలదీశారు. పెద్ద పెద్ద డైలాగులు కొట్టిన మంత్రులు ఎక్కడికి పోయారని హరీశ్‌రావు నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా నిలిస్తే కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఏమీ పట్టనట్టుగా ఉంటోందని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తమ హయాంలో దేవాదుల ప్రాజెక్టు మీద రూ.7,300 కోట్లు ఖర్చు పెట్టి 80 శాతం పనులు పూర్తి చేశామని పేర్కొన్న ఆయన రేవంత్ ప్రభుత్వం కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడ్డారు.'కేసీఆర్ పాలనలో మేము దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చాం. రూ.7.300 కోట్ల ఖర్చుతో 47 వేలు ఉన్న ఆయకట్టును, 3 లక్షల 17 వేల ఎకరాలకు పెంచాం. మరో 33 వేల ఎకరాలు ఈ ప్రాజెక్టుకు అవసరమవ్వగా.. 30 వేల ఎకరాలు భూసేకరణ కూడా పూర్తి చేశాం. ఇంకొక 3వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. దాదాపు రూ.1,000 నుండి రూ.2,000 కోట్లు ఖర్చు పెడితే ఇంకో 2,40,000 ఎకరాల ఆయకట్టు సృష్టించవచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నర ఏండ్లలో కనీసం రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయలేదని కాంగ్రెస్‌పై హరీష్ రావు విరుచుకుపడ్డారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన 'రైతు బంధు' నిధులను ఇంకా విడుదల చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆయన రైతు బంధు ఎప్పుడిస్తారు? అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. 'మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే 17వ తేదీన రైతుబంధు ఇస్తా అన్నాడు, 20వ తేదీ వచ్చింది. అయినా ఇంకా రైతుబంధు రాలేదు. రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా?.. కోతలు జరిగేటప్పుడు ఇస్తారా?' అని రేవంత్‌ను హరీశ్ సూటిగా ప్రశ్నించారు. 'ఇప్పటికే రెండు పంటలకు రైతు బంధు వేయలేదు, ఈ సారి అయినా వేస్తారా లేదా? బడా కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్ల కోసం రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించావు కానీ రైతులకు రైతుబంధు వేయడానికి డబ్బులు లేవా?' అని కాంగ్రెస్ సర్కార్ దాటవేత ధోరణిపై హరీష్ రావు ధ్వజమెత్తారు.

## జీవన్ రెడ్డి మర్యాదకు భంగం కలిగించకండి

### కాంగ్రెస్ అధిష్టానానికి జగ్గారెడ్డి వినతి



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ కష్ట కాలంలో పార్టీతో ఉన్న జీవన్ రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా పార్టీ హైకమాండ్ చొరవ తీసుకోవాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.జగ్గారెడ్డి తాజాగా మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నా. జీవన్ రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయారు. కాంగ్రెస్ పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పార్టీలోనే ఉన్నాడు. రాజకీయంగా జీవన్ రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. కష్ట కాలంలో పార్టీలో ఉన్న జీవన్ రెడ్డికి అవమానం జరగకుండా కాంగ్రెస్ పెద్దలు చొరవ చూపాలి. జీవన్ రెడ్డికి గౌరవం వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరుతున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో, జీవన్‌రెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఫుడ్ పాయిజన్ అయిందని జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్టు సమాచారం.

## వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 20 :** రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చీపురుపల్లి మండలం చొక్కారపాలెం గ్రామానికి చెందిన బొల్లు పైడిరాజు మృతి చెందాడు. రొయ్య పిల్లలను తీసుకురావడం కోసం బొల్లు పైడిరాజు (35) సరకు రవాణా వాహనంలో కాకినాడ జిల్లా వేమవరం వెళ్లారు. అక్కడ సరకు ఎక్కించుకొని తిరుగుముఖం పట్టారు. శుక్రవారం వేకువజామున అనకాపల్లి జిల్లా నక్కపల్లి టోల్ ప్లాజా సమీపంలో వాహన టైర్లలో గాలిని చెక్ చేయడానికి ఆపారు. వాహన చోదకుడు పైడిరాజు గాలిని చెక్ చేస్తుండగా వెనక నుంచి వచ్చిన బొలేరో వాహనం ఢీ కొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్సులో నక్కపల్లి ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆసుపత్రికి అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలో పైడిరాజు మృతి చెందాడు. మృతునికి భార్య, ఓ కుమార్తె,ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇకపోతే పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి శివారున కారు బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన బీరబోయిన వరప్రసాద్, భార్య సీతారత్నం దంపతులు మరో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి కారులో గురువారం అన్నవరంలో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. తిరిగి వస్తుండగా శుక్రవారం ఉదయం జడ్డంగి శివారున కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సీతారత్నం (32) మృతిచెందగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన వారు జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.



## బెంగాల్ సర్ ప్రక్రియపై సంక్లిష్ట పరిస్థితులు

- పరస్పర విమర్శలు సాగడంపై దురదృష్టకరం
- వివాదాల పరిష్కారానికి జ్యుడిషియల్ అధికారుల నియామకం
- హైకోర్టుకు ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పర్యవేక్షణ
- సుప్రీంకోర్టు ధర్మాసనం సంచలన నిర్ణయం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :** ఓటర్ రోల్ క్లీన్-అప్ డ్రైవ్ విషయంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మధ్య పరసర్ప నిందారోణపలు చోటుచేసుకోవడం, ఎస్ఐఆర్ పక్రియపై సంక్లిష్ట పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు శుక్రవారం సంచలన నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాల సవరణపై దురదృష్టకరమైన విమర్శల ఆట కొనసాగుతోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాల సవరణ పక్రియను పర్యవేక్షించేందుకు న్యాయాధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో అభ్యంతరాలు, వివాదాలను జ్యుడిషియల్ ఆఫీసర్లు పరిష్కరిస్తారని పేర్కొంది. రాజ్యాంగ బద్ధ వ్యవస్థలైన రాష్ట్రం, ఎన్నికల కమిషన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. దీంతో ఎస్ఐఆర్ పక్రియ అభ్యంతరాలు, వివాదాల మధ్య చిక్కుకుంది' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కోసం పనిచేస్తున్న జిల్లా జడ్జి హోదాలో ఉన్న మాజీ న్యాయాధికారులను కూడా ఈ పక్రియ కోసం నియమించాలని, అసాధారణ పరిస్థితుల కారణంగా అసాధారణ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయాధికారుల నియామకం, బాధ్యతలకు సంబంధించి సమగ్ర ప్లాన్ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో శనివారంనాడు సమావేశం కావాలని ఎన్నికల కమిషనర్, చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్, ఇతర ఉన్నతాధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడిషియల్ ఆఫీసర్లు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు వేసింది. 'రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆశించాం. అయితే కమ్యూనికేషన్ విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా? ఫిబ్రవరి 9వ తేదీ ఆదేశాలకు ఫిబ్రవరి 17న స్పందించారు. 8,500 ఆఫీసర్లను పంపామంటారు. మేము మైక్రో అబ్జర్వర్లం కాదు. ఈ వ్యవహారం మాకు తీవ్ర అంసతృప్తిని కలిగిస్తోంది. రాష్ట్రాలు సహకరిస్తాయని మేము భావిస్తాం. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులతో సమావేశానంతరం బహిరంగంగానే ఆమె హెచ్చరికలు చేశారు. ఎన్నికల కమిషన్ ముందు లక్షలాది మంది బాధితులను పెరేడ్ చేయిస్తామన్నారు. మమతా బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఈసీ మండిపడింది. ఎన్నికల అధికారులు ఎంతో సంయమనంతో గౌరవంతో ఆమెతో మాట్లాడినట్టు తెలిపింది. అయితే బెంగాల్ ఓటర్ల జాబితా క్లీనప్ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి మినహాయించారని మమతా బెనర్జీ ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన అస్సాంలో ఎందుకు ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించలేదని నిలదీశారు. ఎన్నికల సంఘం బీజేపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని తప్పుపట్టారు.

## ఏప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

### జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 20 :** ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణకు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. ౹రాబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్‌ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణాను గుర్తించిన ఎమ్మెల్యే

**మహబూబాబాద్, ఫిబ్రవరి 20 :** నర్సింహులపేట మండలంలో ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు కొందరు వ్యక్తులు. ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ చేతిలో అడ్డంగా బుక్కయ్యారు. ఎమ్మెల్యే రామచంద్రునాయక్ కౌసల్యదేవిపల్లికి వెళ్తున్న క్రమంలో ఆకేరువాగు బ్రిడ్జీ వద్ద కాన్వాయి ఆపి, ఇసుక ట్రాక్టర్లకు జారీ చేసిన కూపన్లను పరిశీలించారు. ఇసుక ఎక్కడకు తరలిస్తున్నారని ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కూపన్ ఒక చోట ఇసుక తరలింపు మరొక చోట కు ఉండడంతో ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ తహసీల్దార్ రమేష్ బాబును పిలిపించి ఇసుక కూపన్ల జారీ రికార్డులను పరిశీలించి ఎమ్మార్వో పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సింహులపేట మండలంలో ఆకేరు వాగు పరివాహకంలో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఎస్సై, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



## ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థినులు ఆస్పత్రిపాలు

**మెదక్, ఫిబ్రవరి 20 :** జిల్లాలోని రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. దాంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం గుడ్డు కూర తిన్నారు. అయితే అదే గుడ్డు కూరను రాత్రికి పులుసగా తయారుచేసి విద్యార్థులకు వడ్డించినట్లు తెలుస్తోంది. తద్వారా 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం పది విద్యార్థులు తిరిగి కోలుకున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

# ఎన్నికల ఫలితాలు పనితీరుకు గీటురాయి కాదు !



**రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రయోజనాత్మక నిర్ణయాలు ఇంకా తీసుకోలేదు. అయితే వరుస ఎన్నికల్లో గెలవడం వల్ల అధిష్టానం వద్ద మార్కులు కొట్టేశారు. మంత్రులంతా కలసి కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌ను కలిసి శహభాష్ అనిపించుకున్నారు. ఇలాగే పనిచేయండని కాంగ్రెస్ అగ్రనేతలు దీవించి పంపారు. ఇది మాత్రమే కాంగ్రెస్ విజయం కాదు. ఢిల్లీలో కూర్చున్న నేతలకు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన లేదు. సిఎం రేవంత్ కూడా క్షేత్రస్థాయి సమస్యలపై ఇంకా దృష్టి సారించలేదు. ప్రధానంగా తాగు,సాగునీటి సమస్యలు, రైతుల నుంచి ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరలు అందించడం, నిరుద్యోగ సమస్యలు తీర్చడం వంటివన్నీ ప్రధానంగా వెన్నాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో తెలంగాణలో అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉన్న సమస్యలే ఇంకా ఉన్నాయి. అవేవీ పరిష్కారం కాలేదు.**

రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు పంచాయితీ, ఇంకా అంతకుముందు రెండు ఉప ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనకు గీటురాయి కాబోవు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వంపై కొంత కాలంగా విరుచుకుపడుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ పనైపోయినట్టేనని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నాయకులు అది నిజమని కూడా నమ్ముతున్నారు. ఈ ప్రచారానికి తోడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినందున ఇటీవలి వరుస ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే బిఆర్ఎస్ అంచనాకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. కేటీఆర్,హరీష్ రావులుకు ఈ ఫలితాలు ఓ రకంగా హెచ్చరిక లాంటివి. ఎందుకంటే గత పాలనలో తాము చేసిన పాపాలను పక్కన పెట్టి అదేపనిగా విమర్శలు చేస్తూ పోతే ప్రజలు ఆదరిస్తారని అనుకుంటున్నారు. ప్రజలు అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు. ఏవరేమిటో గ్రహిస్తున్నారు. అయితే సిఎం రేవంత్ అందరినీ కలుపుకుని వరుస విజయాలను సాధిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇప్పటికీ తమ నేతగా అంగీకరించడం లేదు.

కాంగ్రెస్ పార్టీలో ఆయన జూనియర్ అని పలువురు వ్యాఖ్యా నిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. లాటరీ తగిలినట్టు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని బిఆర్ఎస్ చేస్తున్న ముఖ్యంగా కెటిఆర్ చేస్తున్న ఆరోపణఅలను వీరు కూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవ్వరినీ నొప్పించకుండా వెళుతోంది. అందుకే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం వ్యూహాత్మకంగా పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అగ్ర నాయకకతంవ ముందు మార్కులు కొట్టేస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ మంచి ఫలితాలను సాధించేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లున్న కాంగ్రెస్‌ను ఏక తాటిపై నడిపించడంలోనూ రేవంత్‌రెడ్డి కృతకృత్యులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్లు కూడా తన నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితిని కల్పిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతంపైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను ఆయన అధిగమిస్తూ వచ్చారు. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నట్టుగా ఉంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కూడా రేవంత్ భుజం తట్టి ప్రోత్సహించింది. శహభాష్ అంటూ పొగిడింది. ఇలాగే నడవండి అంటూ అందరినీ కలిపి సూచించింది. అయితే ఇవొక్కటే రేపటి గెలుపునకు బాటలు వేయవు. గుణాతమక మార్పులు రావాలి. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. మంత్రులు వసూల్ రాజాలుగా మారారని పుంఖానుపుంఖానుగా ఆరోపణలు వస్తున్నాయి. పర్సంటేజీలకు అలవాటు పడ్డారని అంటున్నారు. ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. ఈ అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. ఉద్యోగుల్లో లంచావతారాలు పెరిగాయి.

విద్యుత్ శాఖలో ఏకబిగిన ఓ 9మందిని సస్పెండ్ చేశారు. రోజుకోచోట్ ఎక్కడో ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నాడు. ఈ సమస్య పోవాలి. గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఈ ఫలితాలు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్‌రెడ్డి స్థానం మరింత పటిష్ఠమవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకో మూడేళ్ల వ్యవధి ఉంది. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. అది నిజమైతే బీఆర్ఎస్‌కు మైనస్ అవుతుంది. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోగలగాలి. అందుకు కార్యాచరణ అవసరం.

# సీఎం కప్ సెకండ్ ఎడిషన్ ప్రారంభం

- గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభించిన మంత్రి శ్రీహరి
- క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో సాగుతున్నామని వెల్లడి



**హైదరాబాద్,ఫిబ్రవరి 20 :** సీఎం కప్ – 2026 సెకండ్ ఎడిషన్ అట్టహాసంగా ప్రారంభంఅయ్యింది. మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, క్రీడా శాఖ అధికారులు ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి వివిధ స్కూల్స్,



కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థుల మార్చ్ తో మంత్రి వాకిటి శ్రీహరి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా లేజర్ షో, శివమణి ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సీఎం కప్ 2026 సెకండ్ ఎడిషన్ ను ప్రారంభిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. రాష్ట్రాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చారన్నారు. ఆటల్లో క్రమశిక్షణ ఉంటేనే విజయం సాధ్యం అన్నారు. అంతర్జాతీయ పోటీల్లో క్రమశిక్షణ లేకపోవడం వల్లనే విజయాలు సాధించలేకపోతున్నాం అన్నారు. క్రీడల్లో స్వార్థం, నైపుణ్యం ఉంటేనే రాణిస్తాం. బాల్యంలో ఒక లక్ష్యం పెట్టుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రతి క్రీడాకారుడు ఆటల మీద దృష్టి సారించాలి. ఆడాలనే కసి ఉంటేనే దేశం తరఫున ఆడే అవకాశం వస్తుంది. ఆటలో లీనమై, అదే ప్రపంచం అనుకోని ముందుకు నడవండి అప్పుడే జీవితం బాగుటుంది. గత ప్రభుత్వాలు ఆటలను పట్టించుకో లేదు. తెలంగాణ అంతటా క్రీడా స్ఫూర్తి నింపాలని ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. ఆటలను టైం పాస్ గా కాకుండా విజయం సాధించే దిశగా అడుగులు వేయండి.దేశం, రాష్ట్రం తరుపున ఆడాలనే స్ఫూర్తి ఉండాలని సూచించారు. ఇకపోతే సీఎం కప్ -2026 సెకండ్ ఎడిషన్ కార్యక్రమం సందర్భంగా నేషనల్ మాస్టర్స్ అథెట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివిధ విభాగాల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించిన అథ్లెట్స్ ను క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. వివిధ అథెట్స్ లో మెడల్స్ సాధించి భారత, తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అథ్లెట్స్ ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

# ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై రకరకాల వ్యాఖ్యానాలు

## కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు.. అభినందించిన శశిథరూర్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :** ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై రకరకాల వ్యాఖ్యానాలు వచ్చాయి. ప్రధానంగా కాంగ్రెస్‌లో దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. ఢిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ చాలా బాగా జరిగిందంటూ కొనియాడారు. పెద్ద కార్యక్రమాల్లో కొన్ని అవాంతరాలు జరుగుతుంటాయని.. అయినా కూడా కేంద్రం చాలా బాగా నిర్వహించిందని మెచ్చుకున్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఏఐ సమ్మిట్‌ను విమర్శించారు. 'అస్తవ్యస్తమైన ప్రజా సంబంధాల ప్రదర్శన' అని అభివర్ణించారు. చైనా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా తీవ్రంగా తప్పుపట్టారు. ఫిబ్రవరి 17న జరిగిన శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ రోజున పొడవైన క్యూలు, భారీ జనసమూహం, లాజిస్టికల్ సమస్యలు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. భద్రతా సిబ్బంది నుంచి స్పష్టమైన సూచనలు లేకుండానే గేట్లు మూసేశారని సందర్శకులు తెలిపారు. పెద్ద ఎత్తున వార్తలు హల్‌చల్ చేశాయి. అలాగే గ్రేటర్ నోయిడాకు చెందిన గల్గోటియాస్ విశ్వవిద్యాలయం వివాదానికి దారితీసింది. 'ఓరియన్' అనే రోబోటిక్ కుక్కపై విమర్శలు రావడంతో ఆ విశ్వవిద్యాలయాన్ని ఎక్స్‌పో స్థలాన్ని ఖాళీ చేయమని కోరారు. ఇదిలా ఉంటే ఏఐ సమ్మిట్ నిర్వహణను రాహుల్ గాంధీ తప్పుపడితే.. శశిథరూర్ మాత్రం అభినందించారు. శిఖరాగ్ర సమావేశానికి వెళ్లే అవకాశం నాకు లభించకపోయినా శుక్రవారం నేను ఇక్కడ మాట్లాడుతున్నాను. నాకు అర్థమైనంత వరకు మొదటి రెండు రోజులు చాలా బాగా గడిచాయి. కొన్ని లోపాలు, కొన్ని సంస్థాగత విషయాలు ఉన్నాయి. ఇవి ఒక పెద్ద కార్యక్రమంలో జరుగుతాయని శశిథరూర్ తెలిపారు. ఇటీవలే శశిథరూర్‌తో కాంగ్రెస్ పెద్దలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలపై చర్చించారు. కేరళ ఎన్నికల వేళ ఇదో శుభపరిణామంగా భావించారు. మళ్లీ ఇంతలో ఏమైందో ఏమో తెలియదు గానీ.. మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని శశిథరూర్ ప్రశంసించారు.

## బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు

### 10కోట్లు డిమాండ్ చేసిన బిష్ణోయ్ గ్యాంగ్

**ముంబై, ఫిబ్రవరి 20 :** బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌కు బెదిరింపులు వచ్చాయి. 10 కోట్లు ఇవ్వాలని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపు వచ్చినట్లు తెలుస్తోంది.అమెరికాలో రిజిస్టర్ అయిన ఫోన్ నెంబర్ నుంచి వాయిస్ నోట్ రూపంలో బెదిరింపు వచ్చిందని ఓ మీడియా కథనం పేర్కొన్నది. ఈ కేసులో ముంబై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. క్రైం బ్రాంచ్ నేతృత్వంలో దర్యాప్తు మొదలైంది. నెంబర్ ఎక్కడిదో కనుక్కొనేందుకు అమెరికా భద్రతా సిబ్బందితో పోలీసులు టచ్‌లో ఉన్నారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించే పనిలోపడ్డారు. సాంకేతిక ఆధారాల కోసం అధికారులు వెతుకుతున్నారు. కాల్ డేటా రికార్డులు, డిజిటల్ ఆనవాళ్లను పరిశీలిస్తున్నారు. ముందస్తు జాగ్రత్తగా బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్‌కు భద్రతను పెంచనున్నారు. గతంలో కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులకు పాల్పడింది.

## రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన రోజు

### ఎక్స్ వేదికగా హరీష్ రావు పోస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 20:** రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది నేటికి 12 ఏళ్ల అవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ చేశారు. బిల్ ఈజ్ పాస్డ్ అన్న టైటిల్‌తో ఓ ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన క్రమాన్ని తన పోస్టులో ఆయన వెల్లడించారు. 2014, ఫిబ్రవరి 20వ తేదీన తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం దక్కినట్లు చెప్పారు. శాంతియుతంగా సాగిన స్వరాష్ట్ర ఉద్యమానికి సంకేత సూచకంగా బిల్లు పాసైనట్లు హరీశ్ రావు తన పోస్టులో పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైనట్లు చెప్పారు. కేసీఆర్‌తో కలిసి విక్టరీ సంకేతం చేస్తున్న ఫోటోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. కొన్ని దశాబ్దాల త్యాగం, పోరాటం, ఆత్మగౌరవం.. చివరకు కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినట్లు హరీశ్ తన ఎక్స్‌లో తెలిపారు. జై తెలంగాణ, జై కేసీఆర్ అన్నారు.

## క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారి అరెస్ట్

**నెల్లూరు,ఫిబ్రవరి 20 :** క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టయింది. ఇందుకు సంబంధించి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన వేణు, వెంకటరమణను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.34.6 లక్షల నగదు, ల్యాప్‌టాప్, టీవీ, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారి ఖాతాల్లో ఉన్న రూ.1.64 కోట్లు సీజ్ చేశారు. త్వరలోనే క్రికెట్ బెట్టింగ్ ముఠా నిర్వాహకులను పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు.

## భూతగాదాల్లో కాంగ్రెస్ నేత దారుణ హత్య

**సిద్దిపేట, ఫిబ్రవరి 20 :** సిద్దిపేట జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. భూ తగాదాల నేపథ్యంలో బాల్‌రెడ్డి (50) అనే వ్యక్తిని దాయాదులు హత్య చేశారు. దుబ్బాక పురపాలికలోని చెల్లాపూర్ వార్డు శివారులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చెల్లాపూర్ వార్డుకు చెందిన వంగ బాల్‌రెడ్డిని అదే గ్రామానికి చెందిన దాయాదులు భూ తగాదాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం దారుణంగా గొంతు కోసి చంపారు. అనంతరం నిందితులు తల్లి, కొడుకు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు అనంతరం హత్యకు సంబంధించిన వివరాలు తెలియజేస్తామని ఏసీపీ తెలిపారు.

## మైత్రీవనం కోచింగ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కాంప్లెక్స్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో పలువురు విద్యార్థులు అందులో చిక్కుకుపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. నిచ్చెన సాయంతో 60 మందిని కిందికి దించారు. నీలగిరి బ్లాక్‌లోని షాపులను మూసివేయించారు. కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులను పంపించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. మూడు అంతస్తుల వరకు మంటలు వ్యాపించినట్లు పోలీసులు తెలిపారు. పై అంతస్తులోని కొన్ని ఐటీ సంస్థల్లో ఉన్న కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు మెట్ల మార్గం ద్వారా బయటకు వచ్చారు. మరికొందరిని అగ్నిమాపక సిబ్బంది బాల్కనీ ద్వారా, మెట్ల ద్వారా సురక్షితంగా కిందకు చేర్చారు. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. కొందరు కిందకు దూకేందుకు ప్రయత్నించగా వారిని అగ్నిమాపక సిబ్బంది కాపాడింది.

## ట్రంప్ నిర్ణయాలపై విమర్శలు

### ఇండో అమెరికన్లలో తీవ్ర అసంతృప్తి

**వాషింగ్టన్, ఫిబ్రవరి 20 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై ఇండో–అమెరికన్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ట్రంప్ తీసుకుంటున్న చర్యలు మింగుడు పడడం లేదు. ఇప్పటికే అమెరికాలో ఆ దేశస్తులు రోడ్డెకి నిరసనలు తెలిపారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను నిర్వహిస్తున్న తీరును 55 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. కార్నెగి ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ విడుదల చేసిన '2026 ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్ సర్వే'లో ఈ విషయం వెల్లడైంది. యూగవ్ భాగస్వామ్యంతో నవంబర్ 25, 2025 నుంచి జనవరి 6, 2026 మధ్యలో ఈ సర్వే జరిగింది. ఇందులో వెయ్యి మంది ఇండియన్ అమెరికన్లు పాల్గొన్నారు. భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో ట్రంప్ విధానాలను 55 శాతం మంది వ్యతిరేకించారు. వాణిజ్యం, వ్యూహాత్మక సహకారంలో నెలకొన్న విభేదాలు క్వాడ్ కూటమని, ఇండో–పసిఫిక్ లక్ష్యాలను దెబ్బతీశాయని వారు పేర్కొన్నారు. 25 శాతం మంది మాత్రం ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. మరో 20 శాతం మంది ఆమోదించడం గమనార్హం. మాజీ అధ్యక్షుడు జోబైడెన్‌కు ఈ ఆమోదరేటు 48 శాతంగా ఉండటం గమనార్హం.

## డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో తాత్సారం

### నవంబర్ 18లోపు విచారణ పూర్తి చేయాలని సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 :** వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో జరుగుతన్న జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సమగ్ర దర్యాప్తు చేస్తారా లేక.. కేసును సిబిఐకి అప్పగించమంటారా అని నిలదీసింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ఈకేసును విచారించింది. నవంబర్ 18లోపు విచారణ పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఆనాడు ఎమ్మెల్సీ అనంతబాబుతో పోలీసులు కుమ్మక్కయ్యారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. డిఫాల్ట్ బెయిల్ వచ్చేలోగా ఛార్జిషీట్ దాఖలు చేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అప్పట్లో తప్పుచేసిన పోలీసులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం నిలదీసింది. కేసు ట్రయల్ కోసం హైకోర్టు సీనియర్ న్యాయాధికారిని నియమించాలని ఆదేశించింది. రోజువారీ విచారణ జరిగేలా చూడాలని పేర్కొంది. మార్చి 31లోపు ప్రత్యేక జ్యుడిషియల్ అధికారిని నియమించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టు ఈ కేసులో జోక్యం చేసుకుని అడ్డంకులు సృష్టించవద్దని పేర్కొంది. నిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి దర్యాప్తు చేయడం రాకపోతే సీబీఐకి కేసును అప్పగించాల్సి వస్తుందని సీజేఐ హెచ్చరించారు.

## డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 20 :** సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురిని ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ తరలిస్తున్నారనే సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు అమీన్‌పూర్‌లోని ఓ మార్బుల్ షాపుపై దాడి చేశారు. నిందితుల వద్ద అక్రమంగా నిల్వవున్న 2.7 కిలోల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి డ్రగ్స్ పెడలర్స్ తో పాటు డ్రగ్స్‌ను అమీన్ పూర్ పోలీసులకు అప్పగించారు. రాజస్థాన్‌కు చెందిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు. ఎవరైనా డ్రగ్స్ కొనుగోలు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.



# పోలీస్ అధికారులతో సమీక్ష

## జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ముందుగా వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, ఇప్పటివరకు నమోదైన కేసుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా వేగవంతంగా విచారణ పూర్తి చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, ఆస్తి నేరాలు వంటి అంశాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాలను తగ్గించే దిశగా పని చేయాలన్నారు. అలాగే ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలని, నేరస్తులపై మాత్రం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మానవతా దృక్పథంతో పని చేస్తూ, ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీస్ వ్యవస్థ ముందుకు సాగాలని తెలిపారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సమయంలో పోలీస్ యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను అభినందించారు. భవిష్యత్తులో కూడా అదే నిబద్ధత, క్రమశిక్షణతో టీమ్ వర్క్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రతి పోలీస్ అధికారి తన బాధ్యతను గుర్తించి ప్రజల భద్రతే లక్ష్యంగా పని చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, డి సి ఆర్ బి డీఎస్పీ జానయ్య, ఏ.ఆర్ డీఎస్పీ వీరేష్, సీఐ లు, ఆర్ ఐ లు, ఎస్.ఐ లు, ఆర్ ఎస్ఐ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

## ఎంపీడీఓ షేక్ సిలార్ సాహెబ్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తిరుమలాయపాలెం ఎంపిడిఓ షేక్ సిలార్ సాహెబ్ అన్నారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత ప్రచార రథాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను చేయడం వల్ల బాల, బాలికల భవిష్యత్ ను అంధకారంలోకి నెట్టివేయడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహల నిషేధ చట్టం 2006 ప్రకారం ఆడపిల్లలకి 18 సంవత్సరాలు, అబ్బాయిలకి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలను చేయడం చట్టరీత్యా నేరమని, ఇందుకు గాను జైలు శిక్ష, జరీమాన విధించడం జరుగుతుందని చెప్పారు. బాల్య వివాహాలు జరిగేటప్పుడు స్థానిక పోలీసులకు లేదా 1098 చైల్డ్ లైన్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహ రహిత ఖమ్మం జిల్లా కై ప్రచార రథాన్ని గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 21 మండలాలలో ఈ రథయాత్ర కొనసాగుతుందని, ప్రజలందరూ సహకరించి బాల్య వివాహ రహిత ఖమ్మం జిల్లాను 2030 లోపే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సేవా సంస్థ సభ్యులు రవీందర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలందిస్తుంది

- సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్
- అభివృద్ధిలో 30 డివిజన్ ను అగ్రగామిగా తీర్చిదిద్దుతా: కౌన్సిలర్ శ్రీజ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మీ ఇంటి బిడ్డగా నా ఆడబిడ్డ సేవలు అందిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30 డివిజన్లోని శ్రీ సాయి బృందావనం కాలనీలో అభినందన సభను నిర్వహించారు. కౌన్సిలర్ గా ఎన్నికైన 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు, 30వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీజను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా భగత్ వీడు తండా సర్పంచ్ భూక్య వసంత లక్ష్మి దంపతులకు సన్మానం చేశారు. తొలుత కాలనీవాసులు మౌలిక వసతులతో పాటు పలు సమస్యలను పరిష్కారం చేయాలని కౌన్సిలర్ శ్రీజకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీజ ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా నిలుస్తుందన్నారు.

### అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా..!

30 డివిజన్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతానని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. తన గెలుపుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా తన పని విధానం ఉంటుందని, మున్సిపాలిటీ నుంచి నిధులు తీసుకువచ్చి, డివిజన్ రూపు రేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విజయానికి సంకేతంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, కాలనీవాసులు గుడివాడ శ్రీను, సురభి సాయి, సాంబశివరావు, ఆంగోత్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ముల్కనూర్‌లో ఉచిత వైద్య శిబిరం

- ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఏర్పాటు
- ముల్కనూర్ గ్రామానికి ఇది ఒక అరుదైన అవకాశం
- కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలి
- భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు




**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో నేడు ఉచితం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ముల్కనూర్ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో ఈ ఆరోగ్య శిబిరం కొనసాగనుంది. ఈ కార్యక్రమం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం, జిల్లా వైద్యాధికారి సూచనల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఈ మెగా క్యాంపును ఏర్పాటు చేశారు. పూర్తిగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. బీపీ షుగర్ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డి ఇకో గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు చేయనున్నారు. అంతేకాకుండా గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు మెదడు, వెన్నెముక, ఎముకలు, కంటి సంబంధిత సమస్యలు స్త్రీల వ్యాధులు వంటి అనేక రకాల అనారోగ్యాలపై నిపుణులైన వైద్యులు తనిఖీలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి అక్కడికక్కడే ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారు. చిన్న సమస్య అని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుర్తించేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోనున్నారు. పరీక్షల అనంతరం చికిత్సలు లేదా ప్రత్యేక వైద్య సేవలు అవసరమైన రోగులను గుర్తించి వారికి తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యలను ఆలస్యం చేయడం వల్ల చిన్న వ్యాధులు పెద్దవిగా మారుతున్న నేపథ్యంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ శిబిరం ప్రజల్లో ఆరోగ్యం పై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది. ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదంతో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాన్ని పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి హాజరై పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ముల్కనూర్ గ్రామానికి ఇది ఒక అరుదైన అవకాశం అని ప్రతి ఒక్కరు తప్పకుండా పాల్గొనాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# ప్రజా క్షేత్రంలోనే పాలన.. కార్యకర్తలే మా బలం

- క్యాంప్ కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి
- మంత్రి పొంగులేటి మార్గదర్శకత్వంలో ఏదులాపురం అభివృద్ధి
- మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత కార్యాలయం ప్రారంభం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** అధికారం అంటే గద్దె మీద కూర్చోవడం కాదు.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం క్షేత్రస్థాయిలో శ్రమించడమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు సాయి గణేష్ నగర్ (రోడ్డు నంబర్ 8) లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మార్గదర్శకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యాలయం కేవలం నాలుగు గోడల మధ్య నడిచేది కాదని, ఇది ప్రజల కష్టాలను పంచుకునే వేదిక కావాలన్నారు. చైర్‌పర్సన్ అనిత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సమస్యలను కూడా ఈ కార్యాలయం వేదికగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

### అభివృద్ధిలో రాజీ పడం..!


మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు, తనకు అండగా నిలిచిన మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# కాలనీల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

## మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

### వెస్ట్ క్రాంతి కాలనీ నూతన కమిటీని ఘనంగా సత్కరించిన మాజీ కార్పొరేటర్



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి నగర పాలక సంస్థ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9వ డివిజన్ వెస్ట్రన్ క్రాంతి కాలనీ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ నూతన సభ్యులు మర్యాదపూర్వకంగా హరిశంకర్ రెడ్డిని కలిసిన సందర్భంగా ఆయన వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమానికి, అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు నిరంతరం కృషి చేయాలని కోరారు. ప్రజలందరినీ సమన్వయం చేసుకుంటూ, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కాలనీలో ఐకమత్యాన్ని పెంపొందించాలని ఆయన సూచించారు. కాలనీ సమస్యల పరిష్కారంలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ వాసుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వెస్ట్రన్ క్రాంతి కాలనీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య గౌడ్, మల్లారెడ్డి (గౌరవ అధ్యక్షులు), కోతోళ్ల నర్సింహులు (అధ్యక్షులు), సత్యనారాయణ గౌడ్, అశోక్ రెడ్డి, తిరుమలేష్ (ఉపాధ్యక్షులు), కృష్ణస్వామి (ప్రధాన కార్యదర్శి), శివరాజ్, హీరాలాల్ నాయక్ (కార్యనిర్వాహక అధ్యక్షులు), సురేందర్ రెడ్డి (కోశాధికారి), కాలనీ పెద్దలు పాల్గొన్నారు.




# ఎంప్రో జిమ్‌ను ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎం ప్రో జిమ్ ను ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఎం ప్రో జిమ్ యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాల ఆర్థిక సాయం

**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయిన రాచమల్ల నరసవ్వ కుటుంబానికి 3,000 రూపాయలు అదేవిధంగా. తలారి బలరాం కుటుంబానికి 3,000 రూపాయలు మొత్తం రూ.6000 గ్రామంలోని అన్నారం గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లతా శ్రీనివాస్ ఉప సర్పంచ్ దయానంద్ సేవా సమితి సభ్యులు మురళి. నరేందర్ రెడ్డి కిషన్. దేవదాస్. కీసరి లక్ష్మణ్. ఎల్లం. చాట్ల లక్ష్మణ్. శంకర్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ అమలు చేయాలి

- బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్
- ఆస్తుల జప్తు నోటీసులు వెనక్కి తీసుకోవాలి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** రుణమాఫీ హామీని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి రుణమాఫీ కాకపోవడంతో మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (సొసైటీ) రుణం కలిగి ఉన్న రైతులకు ఆస్తుల జప్తు చేస్తామని బెదిరింపులకు దిగుతూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడంతో రుణమాఫీ కోసం ఎదురుచూసిన రైతులకు నిరాశ ఎదురైందన్నారు. ఇప్పటికే పంట పెట్టుబడి కోసం అప్పు తెచ్చి ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే ఓ వైపు గిట్టుబాటు ధర లేక, మరో వైపు ప్రకృతి వైపరీత్యాలతో రైతుల జీవనం అస్తవ్యస్తంగా మారిందని అయినప్పటికీ రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ చేసి, రైతులకు ఇచ్చిన జప్తు నోటీసులను వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని యెడల బిజెపి ఆధ్వర్యంలో రైతాంగానికి



# మంత్రి పొంగులేటి సహకారంతో గ్రామాభివృద్ధి కృషి చేస్తా

- కాకరవాయి సర్పంచ్ గూడూరు ఉపేందర్
- ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కాకరవాయి గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శనీయంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానని సర్పంచ్ గూడూరు ఉపేందర్ అన్నారు. శుక్రవారం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. వీధుల్లో, సైడ్ డ్రైనేజీలో గత రెండేళ్లుగా చెత్తా చెదారంతో నిండి పేరుకుపోయిన మురుగును వెలికితీసి శుభ్రం చేయించారు. పని చేయడానికి వీలు లేని ప్రదేశంలోనూ పారిశుధ్య కార్మికుల సాయంతో పారిశుధ్య పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ప్రజలకి సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, పార్టీలకు అతీతంగా ప్రజలు ఆశీర్వదించి గెలిపించారని, వారి ఆశయాలకు అనుగుణంగా గ్రామాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో, పాలకవర్గం సమన్వయంతో కాకరవాయి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని చెప్పారు.

# టోల్ ప్లాజాల వద్ద ఇక డిజిటల్ చెల్లింపులు మాత్రమే

**న్యూఢిల్లీ :** జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద ఫీజు చెల్లింపులకు పూర్తిగా డిజిటల్ లావాదేవీలను మాత్రమే అనుమతించే అంశాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పరిశీలిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి నగదు లావాదేవీలను పూర్తి నిలిపివేయాలనుకుంటోంది. ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే టోల్‌ఫీజు వసూలు చేయాలని అనుకుంటోంది. జాతీయ రహదారుల టోల్ ఎకోసిస్టమ్‌ను పూర్తిగా డిజిటల్‌గా మార్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ ఓ ప్రకటనలో పేర్కొంది. టోల్ చెల్లింపుల్లో చాలా వరకు ఫాస్టాగ్ ద్వారానే జరుగుతున్నాయి. దాదాపు 98 శాతం పేమెంట్లు ఈ రూపంలోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఫాస్టాగ్ లేకపోవడం, పనిచేయకపోవడం వంటి కారణాలతో టోల్‌ప్లాజా వద్దకు వచ్చే వాహనాల నుంచి రెండింతల ఫీజు వసూలు చేస్తున్నారు. యూపీఐ ఆప్షన్ ఎంచుకుంటే 1.25 రెట్లు ఫీజు మాత్రమే తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టోల్‌ప్లాజాల వద్ద పూర్తిగా డిజిటల్ రూపంలో చెల్లింపులకు మాత్రమే అనుమతివ్వాలని ఎన్‌హెచ్ఏఐ భావిస్తోంది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదాచేయడం, రుసుముల వసూళ్లలో పారదర్శకత కోసం ఎన్‌హెచ్ఏఐ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో జాతీయరహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై 1150 టోల్‌ప్లాజాలు ఉన్నాయి.





# ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర అమోఘం

## మేడిపల్లి ప్రెస్ క్లబ్ డైరీ ఆవిష్కరణలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వేదిక బాంక్వేట్ హాల్‌లో శుక్రవారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ 2026 నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎంపీ ఈటెల రాజేందర్, మాజీమంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి ముఖ్య అతిథులుగా హాజరై డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో స్థానిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో స్థానిక జర్నలిస్టుల కృషి మరువలేనిదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు ఇంకా నిబద్ధతతో పని చేయాలని, సమాజ హితం కోరే వార్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డెమాను సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, సలహాదారు కల్యారి ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు చింత రమేష్, కోఆర్డినేటర్ రావు నాగిరెడ్డి, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, సీపీఎం మండల కార్యదర్శి సృజన, సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, చెంగిచెర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవి గౌడ్, మాజీ ఎంపీపీ బండారు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్ రావు, కె.వెంకటేష్ గౌడ్, మైనారిటీ అధ్యక్షుడు మదార్, క్లబ్ సభ్యులు ననుబోతు రాము యాదవ్, దూడల విష్ణు గౌడ్, చిన్నం మధు, దాసరి దయాకర్ రెడ్డి, నీరుడు అంజన్ కుమార్, చిన్నం గణేష్, భూష గణేష్, మరాటి మత్స్యగిరి, జక్కు భగీరథ్ రెడ్డి, మోతె రఘు, తిరుపతి రెడ్డి, జంగ నరేందర్ యాదవ్, బైరెడ్డి సందీప్ రెడ్డి, కొండకింది సురేందర్ రెడ్డి, సిహెచ్. రవికుమార్, బి. సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.








## గ్రహాంతర వాసుల సమాచారం బహిర్గతం చేస్తా : ట్రంప్

**యూఎస్ :** అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర వాసుల సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఏలియన్ల సమాచారం ఉన్న ప్రభుత్వ ఫైళ్లను గుర్తించి, విడుదల చేయాలని ఈ మేరకు ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో గ్రహాంతర వాసుల సమాచారం గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ సమాఖ్య సంస్థలకు తాజాగా ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది అమెరికన్లు తమ ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర జీవుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ అన్నారు. అందుకే వాటికి సంబంధించిన ముఖ్యమైన.. ఆసక్తికరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఒబామా గ్రహాంతర వాసుల ఉనికి గురించి మాట్లాడుతూ ఓ రహస్య విషయాన్ని వెల్లడించారని ట్రంప్ మండిపడ్డారు. ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. అయితే ఒబామా చెప్పిన రహస్యం ఏంటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. గతవారం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఒబామా ఏదో ఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను అమెరికాలోని నెవాడలో ఉన్న అత్యంత రహస్య ప్రాంతం 'ఏరియా 51'లో యూఎస్ ప్రభుత్వం నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని పేర్కొన్నారు. గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు. తనకు తెలిసినంతవరకు ఏరియా 51లో ఎటువంటి భూగర్భ కేంద్రాలు లేవని.. ఒకవేళ ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియవని అన్నారు.

## ఎన్ఎస్‌టీఐ హైదరాబాద్‌లో ఫర్నిచర్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్ 9వ బ్యాచ్ విద్యార్థుల కన్వొకేషన్

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** విద్యానగర్‌లోని ఎఫ్ఎఫ్ఎస్‌సీ–ఎన్ఎస్‌టీఐ ప్రాంగణంలో ఫర్నిచర్ అండ్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్ (ఎఫ్ఎఫ్ఎస్‌సి) ఆధ్వర్యంలో మల్టీపర్పస్ అసిస్టెంట్ – ఫర్నిచర్ ప్రొడక్షన్ అండ్ ఇన్‌స్టాలేషన్ కోర్సు పూర్తి చేసిన 9వ బ్యాచ్ విద్యార్థుల కన్వొకేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం, భద్రాచలం జిల్లాల గిరిజన గ్రామాల నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ ప్రోత్సాహంతో శిక్షణ పొందిన తొమ్మిది మంది అభ్యర్థులు అంచనాలు విజయవంతంగా పూర్తి చేసి సర్టిఫికెట్లు అందుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఇతర శిక్షణార్థులతో కలిసి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. నిరుద్యోగ యువతను గుర్తించి పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడం ద్వారా సాధారణ ప్రజలకు ఎఫ్ఎఫ్ఎస్‌సీ ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించిన సంస్థలను ఆయన అభినందించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎం/స గ్రీన్ ప్యానెల్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఫర్నిచర్, ఇంటీరియర్ రంగంలో నైపుణ్యాభివృద్ధికి సహకరిస్తున్నదని తెలిపారు. ఎన్ఎస్‌టీఐ (విమెన్) ప్రిన్సిపాల్ ప్రియా ఎస్ అతిథులను స్వాగతించారు. ఇప్పటివరకు తొమ్మిది బ్యాచ్‌లలో సుమారు 200 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. అందులో 20 మంది మహిళలు ఫర్నిచర్ ప్రొడక్షన్ శిక్షణ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు పొందినట్లు పేర్కొన్నారు. ఈ 20 మంది శిక్షణార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఎం/స ఏ ఎన్ బి ఇంటీరియర్స్ అండ్ ఎక్స్‌టీరియర్స్, కాంఫోస్, క్రిస్మ మాడ్యులర్స్, అరని వుడ్, మాడ్యూలక్స్ ఇంటీరియో, అరనివుడ్ సంస్థల నుంచి అప్రెంటిస్‌షిప్ ఆఫర్ లెటర్లు అందాయి. వారికి నెలకు రూ.15,000 నుంచి రూ.18,000 వరకు స్టైపెండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారతదేశానికి చారిత్రకంగా ఉన్న నైపుణ్య సంపదను గుర్తు చేసిన కృష్ణయ్య, ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలపై కూడా యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎఫ్ఎఫ్ఎస్‌సీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆధునిక యంత్రాలతో అందిస్తున్న శిక్షణను ఆయన ప్రశంసించారు.





## డాక్టరేట్ అందుకున్న కిన్నెర మొగులయ్యకు సన్మానం

### అరుదైన కళాకారుడికి అభినందనలు వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ మహేశ్

**వనస్థలిపురం, రాజముద్ర న్యూస్:** 'తెలంగాణ సంస్కృతిలో అరుదైన కళగా పేరొందిన 12 మెట్ల కిన్నెర గానాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య' అని వనస్థలిపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ టి. మహేశ్ అన్నారు. అంతరించి పోతున్న కళను తన ప్రదర్శనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మొగులయ్యకు ఇటీవల చెన్నైలోని 'గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ' గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం వనస్థలిపురం పీఎస్‌కు వచ్చి ఇన్‌స్పెక్టర్ మహేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మొగులయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కళారంగంలో వారి కృషి రాష్ట్రానికి , దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని ఇన్‌స్పెక్టర్ టి. మహేశ్ ప్రశంసించారు.



## వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్..

### దాని వెనుక రూ.కోట్ల బంగారం

**రాజస్థాన్ :** పాత సినిమాల్లో చూపించినట్టుగా రాజస్థాన్‌లోని ఒక వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్.. దానివెనక రూ.కోట్లు విలువచేసే బంగారమున్న స్ట్రాంగ్ రూమ్ బయటపడింది. ఇదంతా చూసి ఐటీ సోదాలకు వచ్చిన అధికారులు విస్తుపోయారు. రూ.100కోట్ల పన్ను ఎగవేత ఆరోపణల్లో భాగంగా కన్వా గ్రూప్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ప్రముఖ ఫుడ్ అండ్ బెవరేజ్ సంస్థ కన్వా గ్రూప్‌పై పన్ను ఎగవేత ఆరోపణలు రావడంతో మూడు రోజులుగా ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు నగరాల్లో ఉన్న 33 ప్రాంతాల్లో బుధవారం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజుల్లో గ్రూప్ యజమాని ఇల్లు, ఆఫీస్‌లో అనుమానాస్పద దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక మూడో రోజు సోదాల్లో వారికి సీక్రెట్ వాల్ కనిపించింది. దానిని బద్దలుకొట్టి చూడగా.. వెనక ఒక రూమ్ ఉంది. దానిలో కోట్లు విలువచేసే బంగారు నగలు ఉన్నాయి. ఇప్పుడు ఆ మొత్తాన్ని లెక్కిస్తున్నారు. భారీగా వెలుగుచూసిన ఈ సంపద దర్యాప్తు తీరునే మార్చి వేయనుందని అధికారులు పేర్కొన్నారు. ఇది కేవలం పన్ను ఎగవేత కిందికే రాదని, ప్రభుత్వం కళ్లు గప్పి సంపదను దాచి పెట్టడానికి చేసిన పక్కా ప్లాన్ అని వెల్లడించారు. బంగారంతో పాటు రూ.50లక్షల మేర నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రూప్‌నకు చెందిన పది బ్యాంక్ లాకర్లు బయటపడ్డాయి. వాటిలో కూడా లెక్కలోకి రాని నగదు, బంగారం ఉండొచ్చని భావిస్తున్నారు. 2008లో ఈ కన్వా గ్రూప్‌ను నట్వర్‌లాల్ స్థాపించారు. ఈ సంస్థ స్వీట్స్, బేకరీ ఉత్పత్తులను విక్రయిస్తోంది. దీని యజమానులు రూ.100 కోట్ల వరకు పన్ను ఎగవేతకు పాల్పడి, ఆ మొత్తాన్ని లగ్జరీ హోటళ్లలో పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ హోటళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల వేళ కూడా ఈ గ్రూప్ కార్యకలాపాలు కొనసాగుతు న్నాయి. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో వాటిని కొనసాగించేందుకు అధికారులు అనుమతించారు.

## ఇరాన్‌పై దాడులకు.. మమ్మల్ని లాగొద్దు : యూకే

**యూకే:** అణు ఒప్పందంపై చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతో ఇరాన్‌పై దాడులకు అమెరికా సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడులకు తమ దేశంలోని రెండు కీలక స్థావరాలను వాడొద్దని యూకే అగ్రరాజ్యానికి తేల్చి చెప్పింది. దీంతో స్విండన్ సమీపంలోని ఫెయిర్ ఫోర్డ్ బేస్ నుంచి లాంగ్‌రేంజ్ బాంబింగ్ ఆపరేషన్లు నిర్వహించడానికి అగ్రరాజ్యానికి అవకాశం లేకుండా పోయింది. మరోవైపు ఇప్పటికే డియాగో గార్సియా బేస్‌ను మారిషస్‌కు తిరిగి అప్పజెప్పాలన్న యూకే నిర్ణయంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తంచేసిన నేపథ్యంలో తాజాగా ఆ దేశ ప్రభుత్వం అమెరికాపై ఈ నిషేధం విధించడం గమనార్హం. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఆపాలని కొంతకా లంగా అమెరికా ఆ దేశంపై ఒత్తిడి తీసుకువస్తోంది. ఈ విషయంలో జరుగుతున్న చర్చలు విఫలమైతే దాడులు చేస్తామని బెదిరించింది. ఇందుకోసం అనేక యుద్ధ నౌకలు, విమానాలు, సైనిక దళాలను ఇరాన్ వైపు తరలిస్తోంది. ఏ క్షణంలో అయినా ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడే అవకాశం ఉందని యూఎస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఇరాన్‌తో చర్చల గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. మరో 10 రోజుల్లో అణు ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే యూకే విదేశీ భూభాగమైన డియాగో గార్సియా, ఫెయిర్ ఫోర్డ్ బేస్‌ల మీదుగా టెహ్రాన్‌పై దాడులు చేస్తామన్నారు. మధ్యప్రాచ్య ప్రాంతంలో దాడులు చేయడానికి అమెరికా గతంలో ఫెయిర్ ఫోర్డ్ బేస్‌ను, హిందూ మహాసముద్రంలోని యూకే విదేశీ భూభాగమైన డియాగో గార్సియాను ఉపయోగించింది. ఈ నేపథ్యంలోనే మరోసారి ఆ దేశంపై ఆయా స్థావరాల నుంచి దాడులు చేయడానికి యూకేను అనుమతి కోరింది. ఈ క్రమంలోనే తమ బేస్‌లను ఉపయోగించవద్దని కీర్ స్టార్మర్ ప్రభుత్వం తేల్చిచెప్పింది.

# లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నిన్నటి భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించడం గమనార్హం. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 82,272.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,498.14) నష్టాలతో ప్రారంభమైంది. ఆపై లాభాల్లోకి వచ్చిన సూచీ.. ఇంట్రాడేలో 83,132.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 316.57 పాయింట్ల లాభంతో 82,814.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 116.90 పాయింట్ల లాభంతో 25,571.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.02గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, ఎల్‌అండ్‌టీ, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ లాభపడ్డాయి. క్వాలిటీవాల్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.11 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5025 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## ఏఐ వాడకపోతే.. ప్రమోషన్లు కట్

### యాక్సెంచర్ వార్నింగ్

కృత్రిమమేధతో కంపెనీల్లో పని సంస్కృతి మారుతోంది. తమ సిబ్బంది ఏఐను అందిపుచ్చుకొని, మెరుగైన పనితీరు చూపించాలని సంస్థలు కోరుకుంటున్నాయి. తాజాగా యాక్సెంచర్ చేసిన వార్నింగ్ ఆ తరహాలోనిదే. సీనియర్ ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని ఈ టెక్ సంస్థ సూచించింది. వాటి వినియోగం ఆధారంగానే లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని, లేకపోతే ప్రమోషన్లు ఉండవని సంకేతాలు ఇచ్చింది. ఈ మేరకు సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్ చేసిందని మీడియా కథనాలు వెల్లడించాయి. కొంతకాలంగా యాక్సెంచర్ కృత్రిమ మేధపై ప్రధానంగా దృష్టిసారించింది. ఏఐతో రీస్కిల్ చేయడం సాధ్యంకాని ఉద్యోగాలను తొలగించింది. 11వేల మందికి లేఆఫ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే.. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు.. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయొచ్చని గూగుల్ ఇప్పటికే తన ఉద్యోగులకు సూచించిన సంగతి తెలిసిందే. వారికి స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీని ఆఫర్ చేసింది. మరోవైపు.. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ అనేది గూగుల్‌కే పరిమితం కాలేదు. ఇతర టెక్ సంస్థలు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ ఇలాంటి ప్యాకేజీలను ప్రవేశపెట్టాయి. ఏఐని అందిపుచ్చుకునే విషయంలో మైక్రోసాఫ్ట్ తన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు అల్టిమేటం ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి.

## ఏప్రిల్ నుంచి భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం అమల్లోకి..


### పీయూష్ గోయల్



భారత్-అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైన సంగతి తెలిసిందే. ఇది ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. అలాగే యూకే, ఒమన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కూడా అదే నెల నుంచి అమల్లోకి రావొచ్చని మంత్రి చెప్పారు. న్యూజిలాండ్‌తో కుదిరిన డీల్ అమల్లోకి రావడానికి మాత్రం సెప్టెంబర్ వరకు సమయం పట్టొచ్చని తెలిపారు. మార్చిలో యూఎస్‌తో ఖరారైన మధ్యంతర ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఇప్పటికే గోయల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా త్వరలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగొచ్చని దిల్లీలో జరుగుతోన్న ఏఐ సదస్సులో భాగంగా వెల్లడించారు. అలాగే యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో రానున్న కొన్ని నెలల్లో భారత్‌లో పర్యటిస్తారని చెప్పారు. ఇదిలాఉంటే.. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు ఇరుదేశాల ప్రతినిధులు మూడు రోజుల పాటు సమావేశం కానున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ఈ సమావేశం జరగనుంది.

## అమెరికా వ్యూహాత్మక కూటమిలోకి భారత్.. ‘

### ప్యాక్స్ సిలికా’లో చేరిక



అమెరికా నేతృత్వంలో ఏర్పాటైన అంతర్జాతీయ వ్యూహాత్మక కూటమి ‘ప్యాక్స్ సిలికా’లో భారత్ చేరింది. దిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ సమిట్ వేదికగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ కూటమిలో చేరుతూ భారత్ సంతకం చేసింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా రాయబారి సెర్గియో గోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంతకంతో కీలక ఖనిజాల ఉత్పత్తి, కృత్రిమ మేధ వంటి రంగాల్లో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. “ప్రపంచం భారత్‌ను విశ్వసిస్తోంది. మన దగ్గర నిపుణుల కొరత లేదు. ఇప్పుడు ప్యాక్స్ సిలికాలో చేరడం వ్యూహాత్మక ముందడుగు. సెమీకండక్టర్ల సరఫరా గొలుసు, చిప్ తయారీ వంటి రంగాలకు ఇది చాలా కీలకం. ఈ కూటమిలో చేరడంతో భారత ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ పరిశ్రమకు లబ్ధి చేకూరనుంది” అని వెల్లడించారు. అనంతరం సెర్గియో గోర్ మాట్లాడుతూ.. “రెండు దేశాల మధ్య విస్తృత అవకాశాలకు కొదవలేదు. పాక్స్ సిలికాలో భారత్ చేరడం కీలక పరిణామం” అని తెలిపారు. అంతేగాక, త్వరలోనే భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖాముఖి భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. కృత్రిమమేధ పురోగతికి అవసరమైన సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా ఉండేందుకు అమెరికా గతేడాది ఈ ‘ప్యాక్స్ సిలికా’ ప్రోగ్రామ్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో ఆస్ట్రేలియా, గ్రీస్, ఇజ్రాయెల్, జపాన్, ఖతర్, దక్షిణ కొరియా, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యూకే సభ్యదేశాలుగా ఉన్నాయి. భవిష్యత్తులో ఏఐ, సాంకేతిక వ్యవస్థల అభివృద్ధి కోసం విశ్వసనీయ దేశాలన్నీ కలిసి ఓ భాగస్వామ్య ప్రణాళికను రూపొందించడమే ఈ కూటమి లక్ష్యం. అరుదైన ఖనిజాల కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా ఈ కూటమి ఏర్పడింది.



## టీమ్‌ఇండియాలో ఆ ఇద్దరే గేమ్ ఛేంజర్స్

### దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ షాన్ పొలాక్

పొట్టి ప్రపంచకప్‌లో టేబుల్ టాపర్‌గా గ్రూప్ స్టేజిని భారత్ ఘనంగా ముగించిన విషయం తెలిసిందే. సూపర్ 8లో భాగంగా ఆదివారం అహ్మదాబాద్ వేదికగా టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ షాన్ పొలాక్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. ఇరు జట్లలో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారన్నాడు. అయినప్పటికీ జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.. వీరిద్దరూ గేమ్ ఛేంజర్స్ అని పొలాక్ అభిప్రాయపడ్డాడు. ‘భారత్, దక్షిణాఫ్రికా జట్లలో అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. క్వింటన్ డికాక్, అభిషేక్ శర్మతో పోటీ పడగలడు. ఇక ఐడెన్ మార్‌క్రమ్ అయితే ఎవరితోనైనా పోటీ పడగలడు. అయితే ఇరు జట్ల లైనప్‌ను పరిశీలిస్తే.. వారి మధ్య తేడా జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి’ అని పొలాక్ విశ్లేషించాడు. ‘దక్షిణాఫ్రికా జట్టు నాణ్యంగా లేదని నేనడం లేదు. బౌలింగ్‌లో మెరుగ్గానే ఉంది. అయితే టీమ్‌ఇండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా అసాధారణమైన ఆటగాడు. పవర్‌ప్లేలో కొత్త బంతితో అద్భుతమైన బౌలింగ్ చేయగల సామర్థ్యం అతడిలో ఉంది. ఇన్నింగ్స్ మధ్యలోనూ బంతులు సంధించగలడు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో అతడి బౌలింగ్ అసాధారణమైంది’ అని పొలాక్ విశ్లేషించాడు. ‘అలాగే మిడిల్ ఓవర్లలో వరుణ్ చక్రవర్తి చక్కగా బంతులేస్తాడు. క్రీజులో లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ ఉన్నాడా? రైట్ హ్యాండర్ బ్యాటర్ ఉన్నాడా? అన్న దానితో సంబంధం లేకుండా.. వరుణ్ చక్రవర్తి బౌలింగ్ వేయగలడు. ఈ ఇద్దరి వల్లే టీమ్‌ఇండియా బౌలింగ్‌లో మాకంటే కాస్త మెరుగ్గా ఉంది’ అని షాన్ పొలాక్ అభిప్రాయపడ్డాడు.



## అతడు తన శక్తిని పెంచుకున్నాడు

### కృష్ణమాచారి శ్రీకాంత్

భారత యువ క్రికెటర్ శివమ్ దూబెను టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రశంసించాడు. టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నెదర్లాండ్స్‌తో టీమ్‌ఇండియాకు జరిగిన మ్యాచ్‌లో శివమ్ దూబె అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో కేవలం 31 బంతుల్లోనే 66 పరుగులు సాధించాడు. బ్యాట్‌తోనే కాకుండా బంతితోనూ రాణించాడు. బౌలింగ్‌లో రెండు వికెట్లు తీసుకున్నాడు. దీంతో టీమ్‌ఇండియా 17 పరుగుల తేడాతో విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గానూ నిలిచాడు. “మనం ఐపీఎల్‌లో చూసిన, ఇప్పుడు చూస్తున్న శివమ్ దూబెకు చాలా తేడా ఉంది. ముఖం కూడా చాలా సన్నగా మారింది. డైటీషియన్ సలహాతో తన కండరాల శక్తిని పెంచుకుని బౌలింగ్‌లో రాటుదేలాడనిపిస్తోంది. శివమ్ దూబె ప్రస్తుతం మరింత ఫోకస్‌గా కనిపిస్తున్నాడు. పొరపాట్లు దొర్లకుండా షాట్స్ కొట్టగలుగుతున్నాడు. అన్ని షాట్లను చాలా పర్‌ఫెక్ట్‌గా ఆడుతున్నాడు. ఫిట్‌నెస్, టెక్నిక్ మీద కసరత్తు చేసినట్లు కనబడుతోంది. షార్ట్ బాల్స్‌ను ప్రతిసారీ సిక్స్‌లు కొట్టాల్సిన పనిలేదు. సింగిల్స్ కూడా తీసుకోవచ్చని ధోని ఇచ్చిన సలహా పాటిస్తున్నట్లు ఆటలో స్పష్టంగా కనిపిస్తోంది’ అని శ్రీకాంత్ పేర్కొన్నాడు. క్రికెట్ మ్యాచ్‌లు లేని సమయంలో శివమ్ దూబె చక్కటి హోం వర్క్ చేశాడని, బౌలింగ్‌లో ఈ ప్రభావం కనిపిస్తోందన్నాడు. అతడు గుడ్‌లెంగ్త్ బంతులను చక్కగా సంధించగలుగుతున్నాడని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

## పాకిస్థాన్ జట్టును భారత్ సీరియస్‌గా తీసుకోవడం లేదు

### పాక్ మాజీ క్రికెటర్ మహమ్మద్ అమిర్ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రస్తుత టీ20 వరల్డ్‌కప్ 2026లో టీమ్‌ఇండియా ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 61 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 2007 టీ20 వరల్డ్ కప్ నుంచి నేటివరకు ఈ ఇరు జట్లు.. తొమ్మిదిసార్లు ఒకదాంతో మరొకటి తలపడ్డాయి. భారత్ ఎనిమిది సార్లు విజయం సాధిస్తే.. పాకిస్థాన్ ఒక్కసారి మాత్రమే పరాజయాన్ని తప్పించుకోగలిగింది. ఇలా భారత్.. పాక్‌పై స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ అమిర్ పలు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం భారత్.. పాకిస్థాన్ జట్టును అస్సలు సీరియస్‌గా తీసుకోవడం లేదన్నాడు. పాక్ క్రికెటర్ల వికెట్లు తీసిన సందర్భంలోనూ భారత ఆటగాళ్లు సంబరాలు చేసుకోవడం లేదన్నాడు. పాకిస్థాన్‌పై విజయాలనూ ఆ జట్టు సెలబ్రేట్ చేసుకోవడం లేదని మాట్లాడాడు. ‘90వ దశకంలోని టీమ్‌ఇండియాకు, ప్రస్తుత జట్టుకు చాలా తేడా ఉంది. అప్పట్లో భారత జట్టుకు పాకిస్థాన్‌తో మ్యాచ్ ఓడిపోతామనే భయం ఉండేది. కానీ ప్రస్తుత జట్టు పాకిస్థాన్‌ను అస్సలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. పాక్ క్రికెటర్ల వికెట్లు తీసుకున్నప్పుడు కూడా ఆ జట్టు ఆటగాళ్లు పెద్దగా సెలబ్రేట్ చేసుకోవడం లేదు. అలాగే పాకిస్థాన్‌పై విజయం సాధించడాన్ని కూడా వారు చాలా సాధారణ విషయంగానే చూస్తున్నారు.’ అని మహమ్మద్ అమిర్ అన్నాడు. కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా అద్భుత విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 175 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 40 బంతుల్లోనే 77 పరుగులు సాధించి సత్తా చాటాడు. చివర్లో శివమ్ దూబె 17 బంతుల్లోనే 27 పరుగులు రాబట్టాడు. ఛేదనలో పాకిస్థాన్ ఏ దశలోనూ టీమ్‌ఇండియాకు పోటీ ఇవ్వలేకపోయింది. 18 ఓవర్లకు 114 పరుగులకే కుప్పకూలింది. జస్‌ప్రీత్ బుమ్రా ధాటికి పాక్ టాప్‌ఆర్డర్ కకావికలమైన విషయం తెలిసిందే.

## ‘నఖ్వీ’ జిత్తులకు మేం చిత్తయ్యాం

### బీసీబీ మాజీ జనరల్ సెక్రటరీ




పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్ నఖ్వీ మాయమాటలకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ చీఫ్ అమీనుల్ ఇస్లామ్ ప్రభావితమయ్యారని బీసీబీ మాజీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అస్రాఫుల్ హక్ సంచలన ఆరోపణలు చేశాడు. దీంతో బంగ్లాదేశ్ టీ20 వరల్డ్ కప్ 2026కు దూరమైందని ఆవేదన వ్యక్తంచేశాడు. ‘ఒక క్రికెట్ అడ్మినిస్ట్రేటర్‌గా నేను నిబద్ధత, నిజాయతీని విశ్వసిస్తాను. అమీనుల్ ఇస్లామ్ అమాయకుడు. అతడు నఖ్వీ వలలో పడ్డాడు. నఖ్వీనే అమీనుల్‌ను ఈ విషయంలో బలవంతం చేశాడు. కానీ అతడి మాటలు విని ఏం సాధించాం?’ అని సయ్యద్ అస్రాఫుల్ హక్ అన్నాడు. ‘ఆ సమయంలో.. మా ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంది. అయితే అందుకు సరైన కారణాలు లేవు. అలాగే.. బంగ్లాదేశ్‌కు భారత క్రికెట్ నిర్వాహకుల మద్దతు అవసరం. జగ్‌మోహన్ దాల్మియా కాలంలో మాకు గౌరవం, గుర్తింపు ఉండేది. ఇప్పుడు మా ప్రభుత్వ చర్యల కారణంగా మేం నవ్వుల పాలయ్యాం’ అని సయ్యద్ విశ్లేషించాడు. భారత్‌లో తమ జట్టుకు భద్రతాపరమైన సమస్యలను సాకుగా చూపి, తమ మ్యాచులను శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ కోరిన విషయం తెలిసిందే. అయితే భారతదేశంలో భద్రత ప్రమాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఐసీసీ అందుకు అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగింది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది.

## పసికూనపై ఆస్ట్రేలియా ప్రతాపం



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఒమన్‌తో శ్రీలంకలోని పల్లకీల మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఘన విజయం సాధించింది. ఆఖరి మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపొందింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (64) హాఫ్ సెంచరీ సాధించగా.. ట్రావిస్ హెడ్ (32), జోష్ ఇంగ్లిస్ (12) రాణించారు. ఒమన్ బౌలర్ షకీల్ అహ్మద్ ఒక వికెట్ తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ 16.2 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ 9.4 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 108 పరుగులు చేసి విజయం సాధించింది. ఆసీస్ బౌలర్ ఆడమ్ జంపా నాలుగు వికెట్లు తీసి ఒమన్‌ను దెబ్బ కొట్టాడు. అతడితోపాటు గ్లెన్ మాక్స్‌వెల్ 2, బార్ట్‌లెట్ 2.. స్టాయినిస్, ఎల్లిస్ చెరో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌తో టీ20 ప్రపంచ కప్ 2026లో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగిశాయి. తన ఆఖరి మ్యాచ్‌లో విజయంతో ఈ టోర్నీ నుంచి ఆస్ట్రేలియా నిష్క్రమించింది.

రాజముద్ర
www.rajamudranews.com
తెలుగు దిన పత్రిక







## ధనుష్‌తో చేయాలని కోరికగా ఉంది : మృణాల్

టాలీవుడ్ సెన్సేషన్ మృణాల్ ఠాకూర్, కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కొంతకాలంగా ప్రేమలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే, ఈ వార్తలపై మృణాల్ ఇప్పటికే స్పందించి క్లారిటీ ఇచ్చినప్పటికీ పుకార్లకు చెక్ పడటం లేదు. వారు పలు ఈవెంట్లలో సన్నిహితంగా కనిపించడంపై మళ్ళీ చర్చలు మొదలయ్యాయి. అసలు కలిసి ఒక్క సినిమా కూడా చేయని వీరిద్దరి మధ్య ఇంతటి స్నేహం ఎలా కుదిరిందనే ప్రశ్నలు నెటిజన్ల నుంచి వెల్లువెత్తుతున్నాయి.ి దొక పెద్ద మిస్టరీగా మారింది. ఈక్రమంలో.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్, ధనుష్‌తో తనకున్న అనుబంధంపై ఆసక్తికర విషయాలను పంచుకుంది. "ధనుష్ సార్ తన సినిమా 'తేరే ఇష్క్ మే' షూటింగ్‌లో బిజీగా ఉన్నప్పుడు, నేను ఆయనను 'సన్ ఆఫ్ సర్దార్–2' స్పెషల్ స్క్రీనింగ్ కోసం ఆహ్వానించాను. ఆయన వస్తారని నేను అస్సలు అనుకోలేదు, కానీ ఆయన రావడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని మృణాల్ పేర్కొంది. ధనుష్ సర్‌తో కలిసి పనిచేయాలని నాకు కోరికగా ఉంది" అని చెప్పింది. మృణాల్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ధనుష్‌తో కలిసి పని చేయడం తన కల అని ఆమె చెప్పడంతో, త్వరలోనే వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ రాబోతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ముంబైలో ఉండి.. చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా

### కపుల్ ఫ్రెండ్లీ మరో గీతాంజలి అంటూ ప్రభాస్ కితాబు

నటుడు ప్రభాస్ ఫుడ్ లవర్...ఆయన వెరైటీ ఫుడ్ ఇష్టపడతారు. అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష్' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్‌లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి మీరు మాములు వాళ్లు కాదండీ' అంటూ చేసిన కామెంట్స్‌ను ప్రభాస్ గుర్తుచేసుకున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని అగ్రనటుడు ప్రభాస్ అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయవాడ పునుగులు అంటే తనకు ఇష్టమని చెప్పారు. నేను అభిమానుల కోసం సంవత్సరానికి మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నాను. కానీ, ఒక్కటే విడుదలవుతోంది. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. నాకు అన్ని జానర్‌ల పైనా ఆసక్తి ఉంది. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని అంటూ 'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకున్నానన్నారు. పూరి జగన్నాథ్‌లా ఎవరూ రాయలేరు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన్' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. నా సినిమాల్లో కాస్ట్యూమ్స్ కూడా డిఫరెంట్‌గా ఉండేలా చూస్తాను అన్నారు.మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు. ఈ సినిమా చూశాక ప్రేమలో పడాలని ఉందన్నారు. హీరో సంతోశ్ శోభన్ అడిగిన వెంటనే.. అతడికి ఫోన్ నంబరు ఇచ్చారు. ఈ మూవీ బ్యాక్‌డ్రాప్ గురించి ప్రభాస్ మాట్లాడుతూ.. చెన్నైలో తాను గడిపిన రోజులు గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌కు హిట్ ఇచ్చిన 'వర్షం' డైరెక్టర్ శోభన్ తనయుడే ఈ సంతోశ్.



వరుస విజయాలతో అలరిస్తున్నారు నటి రష్మిక. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతూ మల్టీటాలెంటెడ్ అని నిరూపించుకుంటున్నారు. ఇప్పుడు ఆమె తర్వాత ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ సినిమాలో కృతి సనన్, రష్మిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి పాత్రల గురించి బాలీవుడ్ మీడియాలో వచ్చిన వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ చిత్రంలో కృతి, రష్మిక స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక

## ఎవరూ ఊహించని పాత్రలో రష్మిక..

సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. హోమీ అదజానియా దర్శకత్వంలో 'కాక్‌టెయిల్ 2' రానుంది. జనవరి 31న ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. ఇది ఎంతో ప్రత్యేకంగా నిలవనుందని ఆ సందర్భంగా దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. షాహిద్ ఇందులో ఇప్పటివరకూ చూడని పాత్రలో కనిపించనున్నట్లు చెప్పారు. 2012లో దీపికా పదుకొణె, డయానా, సైఫ్ అలీఖాన్‌లు నటించిన 'కాక్‌టెయిల్' చిత్రానికి సీక్వెల్‌గా 'కాక్‌టెయిల్ 2' రానుంది.




## చేతలతోనూ అవమానించారు

హిందీ భాషపై మంచి పట్టు ఉన్నప్పటికీ బాలీవుడ్‌లో తన సినీ ప్రయాణం అనుకున్నంత సులభంగా సాగలేదంటోంది హీరోయిన్ రెజీనా. దక్షిణాదికి చెందిన ఈ తార తెలుగు సినిమాలతోపాటు పలు హిందీ, తమిళ చిత్రాలతోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా హిందీ చిత్రసీమలోని కెరీర్ గురించి పలు విశేషాలను పంచుకుంది. "నేను దక్షిణ భారత నటిని. అయినప్పటికీ హిందీ చాలా బాగా మాట్లాడేదాన్ని. బాలీవుడ్ కెరీర్ ప్రారంభంలో నాకు కొన్ని సవాళ్లు ఎదురయ్యాయి. చాలామంది నన్ను మాటలతోనే కాదు.. చేతలతోనూ అవమానించిన సందర్భాలున్నాయి. అప్పుడు హిందీ భాషపై నాకున్న పట్టు నన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. కానీ, అలాంటి పరిస్థితుల్లో సినిమాలను ఎంచుకోవడం చాలా కష్టంగా ఉండేది. తక్కువ ప్రాధాన్యత ఉండే పాత్రలు వచ్చేవి. వాటిని చేయడం సులభమే. కానీ, నేను మెయిన్ స్ట్రీమ్ కమర్షియల్ చిత్రాలను చేయాలనుకోవడం లేదు. అందుకని వైవిధ్యంగా ఉండే పాత్రలనే ఎంచుకునేదాన్ని. బాలీవుడ్‌లో అప్పుడు నాకు ఎదురైన పరిస్థితులే ఎప్పటికీ అలానే ఉంటాయని నేను చెప్పను. ఎందుకంటే ఇప్పుడు చాలామంది భాషలతో సంబంధం లేకుండా అన్ని చిత్రపరిశ్రమలలోనూ నటిస్తున్నారు"అని చెప్పుకొచ్చింది. రెజీనా తదుపరి.. అగ్ర కథానాయిక నయనతార నటిస్తున్న 'మూకుతి అమ్మన్ 2' సినిమాలో కనిపించనుంది.

## ఉస్తాద్ నుంచి 22న మరో సాంగ్ విడుదల

గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ – డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.




## యశ్ టాక్సిక్ టీజర్ విడుదల

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజెబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ్ కనిపించారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com